క్లుప్తంగా

వివాహ వేడుకల్లో బియ్యపు పవిత్రారెడ్డి



వివాహ వేడుకల్లో బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలులో మాజీ సర్పంచ్ దండి రాఘవయ్య సోద రుడి కుమారుడు పృథ్వీరాజ్, వేదీప్య వివాహ రిసెప్షన్‌కు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె హాజరయ్యారు. నూ తన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ మైలేరు గంగయ్య, సుధాకర్, జ నార్దన్, బాబు, వెంకటరామయ్య, శేఖర య్య, అమర్‌నాథ్, సునీల్, వెంకయ్య, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో వంతెన



ప్రమాదకరంగా మారిన వంతెన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టు వరత్తూరు గ్రామం వద్ద శ్రీకాళహస్తి, తడ రోడ్డుపై నిర్మించిన వంతెన దుస్థితికి చేరుకుంది. ఉబ్బలమడుగు అటవీప్రాంతంలోని వర్ష పునీరు సముద్రంలోకి వెళ్లడానికి ఉన్న ఒరవ కాలువపై 30 ఏళ్ల కిందట వంతెన నిర్మించారు. అప్పటి నుంచి వంతెనకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో దుస్థితికి చేరుకుంది. వంతెనకు ఇరువైపుల ఉన్న పిట్ట గోడలు ధ్వంసం కావడంతో వాహనదారులు ప్రమాదకర రీతిలో డ్రైవింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం వంతెనపై భారీ వాహనాలు, బస్సులు, కార్లు వేల సంఖ్యలో వెళ్తుంటాయి. వాహనదారులు ప్రమా దం బారిన పడకుండా ఉండడానికి ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆటో మొబైల్ నగర్ ఏర్పాటు చేయాలి



సమావేశమైన మెకానిక్‌లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో ఆటోమొబైల్ నగర్‌ను ఏర్పాటు చేయాలని ఆటో మెకానికల్ ఇంజినీరింగ్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షుడు గోపినాయుడు అన్నారు. ఆదివారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మెకానికల్ షెడ్లు, ఇంజినీరింగ్ వర్క్‌షాప్, గ్యాస్ వెల్డర్, ట్రాక్టరు ట్రక్కులు తయారు, స్పేర్‌పార్ట్స్‌కు ఎంతోకాలంగా సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆటోమొబైల్ నగర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌గౌడ్, మునిగోపాల్, సాధిక్‌బేగ్, మణి, రవి నాయుడు, తిరుపాల్‌రెడ్డి, చెంగల్‌రాయులు, మీర్జాబేగ్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వీల్‌చైర్లు వితరణ



ఆలయానికి వీల్‌చైర్లు అందిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఇదే ఆలయంలో పనిచేసిన విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి భార్య నాగభూషణమ్మ రెండు వీల్‌చైర్లను వితరణ చేశారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎంఆర్‌సీకి చేరిన టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్స్

సత్యవేడు: మండల పరిధిలోని 65 పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ ఎంఆర్‌సీకి చేరినట్లు ఎంఈఓ కే.రవి తెలిపారు. మూడు రకాల కెమికల్ 5 లీటర్లు, 1 లీటరు క్యాన్లు అందాయన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 965 లీటర్లు క్లీనింగ్ మెటీరియల్‌ను త్వరితగతిన పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

ఆటోకు భారీ జరిమానా

తిరుపతి క్రైమ్: నగరంలోని లీలామహల్ ఫ్లైఓవర్‌పై వన్‌వేలో ప్రయాణించిన ఆటోకు భారీ జరిమానా విధించినట్లు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు వేగంతో వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మొదటిసారి ఫైన్‌తో వదిలేస్తామని, రెండోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆదివారం.. అందని వైద్యం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా వ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లా అధికారులంతా ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రజల ఆరోగ్యం గురించి పర్యవేక్షిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అందుకు భిన్నంగా ఉంది. సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు ధుమ్మా కొడుతున్నారు. ప్రధానంగా స్టాఫ్ నర్సులు, సిబ్బంది, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, కీలక సిబ్బంది సైతం ఏ కేంద్రంలోనూ ఆదివారం, సెలవు దినాల్లో కనిపించడం లేదు. సగానికి పైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సెలవు దినాల్లో తాళాలతో దర్శనమిస్తున్నాయి.

- సెలవు దినాల్లో విధులకు ధుమ్మా కొడుతున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది
- సత్యవేడు నియోజకవర్గంలో ఆదివారం ఒక్కచోట కూడా విధులకు రాని వైద్యులు
- వైద్యం అందించిన స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది
- రోగాలతో సతమతమవుతున్న పల్లె జనం
- ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్న రోగులు

వరదయ్యపాళెం: వైద్య, ఆరోగ్య శాఖలో ఏడాది పొడవునా ఆస్పత్రులు పని చేయాలి. వారంలో ఒకరోజు నిర్దేశిత సిబ్బందికి మాత్రమే సెలవు అవకాశం ఉంటుంది. లేదా ప్రభుత్వం మంజూరు చేసే ఇతరత్రా సెలవులను ఉపయోగించుకోవచ్చు. ప్రతి పీహెచ్‌సీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు ఉండాలి. ఇతర శాఖల సిబ్బంది మాదిరే ఆరోగ్యశాఖలోనూ ఆదివారం సెలవు అన్న భావన ప్రజల్లో నాటుకుపోయింది. కొన్నిచోట్ల ఆదివారం వైద్యులు ఎవరూ రారు అనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆస్పత్రులకు రోగులు వెళ్లడం లేదు.





గేటు తెరుచుకోని వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీఎన్‌కండ్రిగలో డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

మూతపడిన కేంద్రం..

మండలంలోని వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆదివారం మూతపడింది. మధ్యాహ్నం వరకు వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి రాలేదు. ఈ విషయమై స్థానికులను విచారించగా ఆస్పత్రికి ఆదివారం సెలవు అని, శనివారం మధ్యాహ్నమే వైద్యులు, సిబ్బంది ఇళ్లకు వెళ్లి సోమవారం ఉదయం విధులకు హాజరవుతారన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలోని ఇందిరానగర్, పద్మావతిపురం, లక్ష్మీపురం, ముస్లింపాళెం ప్రాంతాల్లో జ్వరాలు ప్రబలడంతో అక్కడి జనం స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

స్టాఫ్ నర్సు వైద్యమే దిక్కు..

కేవీబీపురం మండల కేంద్రంలోని 24/7 స్థాయి కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం అయితే వైద్యులు విధులకు రారు. వచ్చే రోగులకు స్టాఫ్ నర్సు ఒకరే దిక్కు. అత్యవసర చికిత్సల నిమిత్తం వచ్చేవారికి వైద్యం అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలి. కానీ వైద్యులు మాత్రం విధులకు ధుమ్మా కొడుతున్నారు. ఇద్దరు వైద్యులు ఉండే ఇక్కడ కనీసం ఒక్కరూ కూడా విధులకు హాజరు కాకపోవడం గమనార్హం.





కేవీబీపురం పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు, నాగలాపురం పీహెచ్‌సీలో మూతబడిన వైద్యుడి గది

నాగలాపురంలో ఇదే పరిస్థితి..

నాగలాపురంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆదివారం తెరుచుకున్నప్పటికీ అక్కడ ఉండాల్సిన ఇద్దరు వైద్యులు గైర్హాజరయ్యారు. దీంతో స్టాఫ్ నర్సు, అటెండర్ ఆస్పత్రిని తెరిచి కూర్చున్నారు తప్ప రోగులకు వైద్యం మాత్రం అందలేదు.

బుచ్చినాయుడుకండ్రిగలో...

మండలకేంద్రంలో ఉన్న 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం స్టాఫ్ నర్సు, కింది స్థాయి సిబ్బంది వైద్యసేవలు అందించగా వైద్యులు విధులకు డుమ్మా కొట్టారు. ఆదివారం డాక్టర్ ఆస్పత్రికి రాడని, ఉన్న సిబ్బంది వద్దే తాము వైద్యం చేయించుకుంటామని అక్కడి స్థానికులు తెలిపారు.

మూతపడిన పీహెచ్‌సీలు..

సత్యవేడు మండలంలోని దాసుకుప్పం, కేవీబీపురం మండలంలోని కోవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నారాయణవనం, పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆదివారం పూర్తిగా మూతపడ్డాయి.

స్టాఫ్‌నర్సులు మినహా అంతా ధుమ్మా..

వరదయ్యపాళెం మండలంలోని చిన్నపాండూరులో ఉన్న రౌండ్ ది క్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఒక స్టాఫ్‌నర్స్ మినహా మిగిలిన సిబ్బంది, డాక్టర్ విధులకు ఆదివారం గైర్హాజరయ్యారు. అనేకమంది వైద్యం కోసం వచ్చి డాక్టర్ లేకపోవడంతో వెనుదిరిగారు. కొంతమంది వృద్ధులు ఉదయం 11 గంటల వరకు వైద్యుడి కోసం వేచిచూసినా ఫలితం లేదు. 8 ఉపకేంద్రాలు కలిగిన చిన్నపాండూరు పీహెచ్‌సీలో దాదాపు 30 గ్రామాల వారికి వైద్యం అందించాల్సి ఉంది. రోజువారీ ఇక్కడ 200కు పైగా ఓపీ నమోదు అయ్యేది. అయితే ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ రోజువారీ హాజరయ్యేది ఒకరు మాత్రమే. మరొకరు 104 సేవలకు వెళ్తారు.



చిన్నపాండూరు పీహెచ్‌సీలో వైద్యం చేస్తున్న స్టాఫ్ నర్సు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

శ్రీకాళహస్తి: తొట్టంబేడు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మారెమ్మకు అంబలి



రేణిగుంట: మండల పరిధిలోని ఎలమండ్యం దళిత వాడలో ఆదివారం మారెమ్మ తల్లికి మహిళలు అంబలిపోసి మొక్కులు చెల్లించారు. ఉదయం అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పుజలు నిర్వహించారు. తర్వాత గ్రామస్తులంతా ఆలయం వద్దకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. వేపాకు తోరణాలతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. రాత్రి అమ్మవారికి భారీస్థాయిలో కుంభాలు పోసి అమ్మవారి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



అలంకరణలో పచ్చాలమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మ దేవతకు అమ్మవారిని పురస్కరించుకుని ఆదివారం గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీ పచ్చాలమ్మ దేవతకు విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

హైవే పైకి వర్షపునీరు

రేణిగుంట: కరకంబాడి–తిరుపతి మార్గం.. కరకంబాడి పంచాయతీ కార్యాలయం సమీపంలో హైవే రోడ్డు మీద వర్షపునీరు మడుగులా వచ్చి చేరడంతో వాహన చోదకులు రాకపోకలను సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని కొండను ఓ నాయకుడు తవ్వేసి మట్టి తరలిస్తుండడంతో కొండ ఊట నీరంతా రోడ్డుపైకి వచ్చి మడుగులా తయారైంది. దీంతో రాత్రివేళల్లో కొందరు జారి పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని మడుగును తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



కరకంబాడి రోడ్డులో నిలిచిన వర్షపునీరు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరత నాట్యం ప్రేక్షకులను అలరించింది. మద్రాసుకు చెందిన శ్రీశంకర నాట్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా శివస్లోకం, శ్రీరామచంద్ర కీర్తన, స్వగతం కృష్ణ సుస్వాగతం, కన్నన్ వరుగింద్ర నీరం, ఆదిదానో రంగా, తోడై మంగళం, హరే రామరామ గోవింద్ హరే, కంగల తీరంత, గోవిందన్ కౌజల్ వంటి పాటలకు కళాకారులు హర్షద, అనూష, అక్షరం, సహానా, రోషికా, దీప్త, సంగీత, ధాన్వియ, ప్రగతి, భవదర్శిని, మహతి, యాషిని ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ సిబ్బంది

రేణిగుంట: మండలంలోని జీవాగ్రం కేఆర్‌సీ విద్యాసంస్థల్లో చదువుతున్న సుభాష్ 68వ స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో నవంబర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని విద్యాసంస్థల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, కోచ్ కుమార షణ్ముగం తెలిపారు. విద్యార్థి సుభాష్‌ను స్కూల్ యాజమాన్యం అభినందించారు.

అలరించిన హరికథా గానం





హాజరైన ఉద్యోగులు, గ్రామస్తులు, శ్రీసిటీలో పద్మావతి పరిణయం హరికథా గానం చేస్తున్న వెంకటేశ్వర్లు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన హరికథా విద్వాంసులు వెంకటేశ్వర్లు భాగవతార్ శ్రీసిటీలో ఆలపించిన పద్మావతి పరిణయం హరికథా గానం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఆరూరులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీసిటీ వ్యాపార వాణిజ్య కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరికథకు పాటలను జోడించి అద్భుత హావభావాల మేళవింపుతో శ్రీనివాసుడు పద్మావతిదేవి దివ్య వివాహాన్ని భాగవతార్ వెంకటేశ్వర్లు ఎంతో ఆసక్తికరంగా అనర్గళంగా వివరించారు. తిరుమల తిరుపతి ప్రాముఖ్యతను శ్రీనివాస భగవానుడి అవతారం, పద్మావతి పట్ల ఆయనకున్న ప్రేమ, వారి అపూర్వ కలయికను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా హరికథా కళాకారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ కార్యక్రమ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

పేదలపై దయ చూపరా..!

పేదల పట్ల అధికారులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను వారు కాయకష్టం చేసి సాగుకు పనికి వచ్చేలా తీర్చిదిద్దుకున్నారు. అప్పటి నుంచి వారు ఆ భూములను సాగు చేసుకుని జీవనాధారం సాగిస్తున్నారు. అయితే వారికిచ్చిన భూములను విమానాశ్రయ అభివృద్ధి కోసం అని తీసుకున్నారు. కానీ నిరుపేద దళితులకు పరిహారం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహస్తున్నారు. ఇప్పటికైనా పరిహారం ఇచ్చి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

- దళితులకు జీవనాధారంగా ఉన్న భూములను సేకరించిన అధికారులు
- ఏళ్ల తరబడి పరిహారం ఇవ్వని వైనం
- విమానాశ్రయ అభివృద్ధి పనుల అడ్డగింపు
- పరిహారం ఇచ్చి న్యాయం చేయాలంటున్న పేదలు
- పట్టించుకోని అధికారులు

ఏర్పేడు: వికృతమాల దళితులకు ఏళ్ల కిందట ప్రభుత్వం డీకేటీ భూములను పంపిణీ చేసింది. వారు ఆ భూములను చదును చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ పనుల్లో భాగంగా దళితుల భూములను రెవెన్యూ అధికారులు సేకరించారు. ఇప్పటివరకు వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవడంతో తాము ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నామని దళితులు ఆవేదన చెందుతున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూపులు..

పరిహారం ఇచ్చి తమకు న్యాయం చేయాలని వికృతమాల దళితులు విన్నవిస్తున్నారు. ఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురు చూస్తున్న దళితుల పట్ల అధికారులు కనికరం చూపడం లేదు. మండలంలోని వికృతమాలకు చెందిన 58 మంది దళితులకు 1995, 2005లో రెండు విడతలుగా అదే రెవెన్యూలోని సర్వేనంబర్లు 437, 438, 448, 458లో 70 ఎకరాల డీకేటీ భూములను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ భూములను సొంత ఖర్చులతో ఎత్తు, పల్లాలను చదును చేసుకుని వ్యవసాయాన్ని సాగు చేసి కుటుంబ జీవనం సాగిస్తున్నారు. అలాంటి తరుణంలో 2010లో తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణలో భాగంగా రెవెన్యూ అధికారులు వారి భూములను సేకరించారు. అప్పట్లో ఒక ఎకరాకి రూ.5.50 లక్షలను నష్టపరిహారంగా అందజేస్తామని అధికారులు దళితులకు హామీ ఇచ్చారు. వారి వద్ద నుంచి డీకేటీ నమూనా, బ్యాంకు పాసుపుస్తకాలను సేకరించారు. భూములను సేకరించిన రెండేళ్లకు 23 మంది నిర్వాసితులకు రూ.5 లక్షల వంతున నష్టపరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగిలిన వారికి ఇప్పటివరకు చెల్లించకపోవడంతో దళితులు ఆవేదన చెందుతున్నారు.



తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి సేకరించిన దళితుల భూములు



పరిహారం చెల్లించకుండానే..

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించామని పలుమార్లు అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రయత్నించారు. తమ భూములకు నష్టపరిహారం చెల్లించేంతవరకు పనులు చేపట్టరాదని దళితులు అడ్డుకుని పోరాటాలు చేస్తున్నారు. తమ కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న భూములను బలవంతంగా లాక్కొని నష్టపరిహారం చెల్లించకుండా వీధిన పడేశారని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం చెల్లించకుంటే ఆ భూముల్లో తాము మళ్లీ సాగు చేసుకుంటామని నిర్వాసితులు అంటున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుని తమకు పరిహారం అందించాలని దళితులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం..



తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి పనుల్లో భాగంగా మేము వ్యవసాయం చేసుకునే రెండు ఎకరాలను కోల్పోయాం. ఇప్పటి వరకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. ఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురు చూస్తున్నాం.

– శ్రీనివాసులు, నిర్వాసితుడు, వికృతమాల దళితవాడ, ఏర్పేడు

బలవంతంగా లాక్కున్నారు



సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు విమానాశ్రయ అభివృద్ధి పేరిట బలవంతంగా లాక్కొన్నారు. పరిహారం చెల్లించేంతవరకు పోరాటాలు ఆగవు.

– ఐతేపల్లి గురునాథం, నిర్వాసితుడు, వికృతమాల దళితవాడ, ఏర్పేడు

పరిహారం చెల్లించేలా కృషి చేస్తాం..



వికృతమాల దళితుల నుంచి సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళతాం. పరిశీలించి నిజమైన నిర్వాసితులకు పరిహారం చెల్లించడానికి కృషి చేస్తాం.

– భార్గవి, తహసీల్దారు, ఏర్పేడు

చెత్త తొలగింపు



చెత్తను తొలగించడంతో శుభ్రంగా ఉన్న సంత

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని తెలుగుగంగ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంతలో వ్యాపారులు వదలి వెళ్లిన చెత్తను గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపసర్పంచ్ మునిరాజా తొలగింపజేశారు. ఆదివారం సాక్షి దినపత్రికలో చెత్తను తొలగించండి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ మునిరాజా స్పందించి స్థానిక పారిశుద్ధ్య కార్మికులచే చెత్తను తొలగించారు. దీనిపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇరుగుళంలో భూసర్వే

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం పంచాయతీలో రెవెన్యూ అధికారులు ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సర్వేను చేపట్టారు. ఆదివారం తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నాలుగు టీంలు భూములు పరిశీలించి రైతు వివరాలు, స్థలం ఎవరి పేరున ఉన్నది గుర్తించి సర్వేలు చేపట్టారు. ఎఫ్‌ఎంబీకి అడంగల్‌కు తేడా ఉన్న భూములు గుర్తించి సర్వేలు నిర్వహించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట డివిజన్ సర్వే అధికారి ప్రసాద్ రావు, సర్వేయర్ చంద్రశేఖర్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.